క్లుప్తంగా

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులను పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ హైస్కూల్ కాంప్లెక్స్‌లో పలు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, సీఆర్‌పీ ఎల్.చైతన్య వీటిని పర్యవేక్షించారు. కంచరపాలెం, కప్పరాడ, తిక్కవానిపాలెం, ధర్మానగర్, కె.కాలనీ, సుభాష్‌నగర్, రాంజీ ఎస్టేట్ తదితర పాఠశాలలకు చెందిన సబ్జెక్ట్ టీచర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు రేషన్ పంపిణీ



సరకులు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం గర్భిణులు, బాలింతలకు రేషన్ సరకులు అందజేశారు. ఆగస్టు 1 నుంచి ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరకులు అందించాలని ఐసీడీఎస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులైన వారందరికీ పంపిణీ చేస్తున్నట్లు అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త కోట దేవి తెలిపారు.


విద్యార్థినులకు రక్త పరీక్షలు



బాలికలకు ఐరన్ మాత్రలు అందిస్తున్న ఆశ వర్కర్ స్వాతి

కంచరపాలెం: స్థానిక రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాల, కంచరపాలెం, ఆర్పీ పేట ప్రాథమిక పాఠశాలల్లో గురువారం విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కంచరపాలెం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పి.మణి, గోక స్వాతి పర్యవేక్షణలో బాలికలకు రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి, బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేసి, ఐరన్ మాత్రలు అందించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతలకు ఐరన్ మాత్రలు పంపిణీ చేసి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చవితి రాట మహోత్సవం



చవితి ఉత్సవాలకు రాట వేస్తున్న నాయకులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో వినాయక చవితి ఉత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. వీఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ వినాయక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవాలకు పందిరి రాట వేశారు. కార్యక్రమంలో 62వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. 62వ వార్డు వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు ఆడారి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకులు పీలా అనంత్, మాధవి, గలగల్ల లక్ష్మణరావు, కామేశ్వరరావు, నక్కా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు రాఖీ కడుతున్న మేయర్ హరి వెంకట కుమారి



బుచ్చిరాజుపాలెం వసతి గృహంలో రాఖీ కడుతున్న మహిళ



అన్నలకు రాఖీలు కడుతున్న చెల్లెమ్మలు

ఆత్మీయ బంధానికి 'రక్ష'

- ఘనంగా రక్షాబంధన్ వేడుకలు
- సోదరులకు రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లు



లక్ష్మీనగర్‌లో ఆడారి ఆనంద్‌కుమార్‌కు రాఖీలు కడుతున్న మహిళలు

గోపాలపట్నం: సోదరీ, సోదరుల అనుబంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్‌ను నియోజకవర్గ పరిధిలో గురువారం వేడుకగా జరుపుకొన్నారు. సోదరులకు అక్కచెల్లెమ్మలు రాఖీ కట్టారు. పలువురు ప్రజా ప్రతినిధులు స్థానిక మహిళలతో పాటు బ్రహ్మకుమారీలు రక్షాబంధన్ కట్టారు.

- జీవీఎంసీ 92వ వార్డు లక్ష్మీనగర్‌లో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్‌కు, జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావుకు 91, 92 వార్డుల మహిళలు రాఖీలు కట్టారు. స్వీట్లు తినిపించారు.
- ఎమ్మెల్యే గణబాబుకు ఆయన ఇంటి వద్ద బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి చిత్ర పటాలు అందించారు. స్థానిక మహిళలు రక్షాబంధనం కట్టారు.
- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు మేయర్ హరి వెంకటకుమారి ఆయన కార్యాలయంలో రాఖీ కట్టారు. తనకు ప్రతీ సమావేశంలో అండగా నిలిచి పరిపాలన సజావుగా సాగించేందుకు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అనుబంధం కొనసాగాలని ఆకాంక్షించారు. శ్రీధర్‌కు ఆయన కార్యాలయంలో నగరానికి చెందిన బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి, చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించారు.
- జీవీఎంసీ 89వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణకు స్థానిక మహిళలు రాఖీలు కట్టారు.

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో గురువారం రక్షాబంధన్ వేడుక ఘనంగా జరిగింది. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి గుర్తుగా ఆశ్రమంలో ఉన్న మహిళలతో పురుషులకు రాఖీ కట్టించి ఆశీర్వచనాలు తీసుకునేలా మేనేజర్ మమత ఏర్పాట్లు చేశారు. కుటుంబ బంధాలకు దూరంగా ఆశ్రమం పొందుతున్న వారికి రాఖీ బంధంతో ప్రేమానురాగాలను స్మరించుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు మళ్ల ధనలత, తోనంగి వెంకటరమణి యాదవ్, చుక్క వరలక్ష్మి తదితరులు ఆడారి ఆనంద్‌కుమార్ కార్యాలయానికి వెళ్లి ఆయనకు రాఖీలు కట్టారు.

- బ్రహ్మకుమారి సంస్థ శ్రీహరిపురం నిర్వాహకురాలు సింధు మల్కాపురం స్టేషన్‌లో పలువురు అధికారులకు, సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.
- యాదవ సంఘం నాయకుడు ప్రసాద్‌యాదవ్ మేయర్ గొలగాని హరివెంకటకుమారి వద్దకు వెళ్లి ఆమెతో రాఖీ కట్టించుకున్నారు.

కంచరపాలెం: శ్రావణ మాస శుద్ధ రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి సందర్భంగా గురువారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నలకు చెల్లెళ్లు, తమ్ముళ్లకు అక్కలు రాఖీలు కట్టి ప్రేమాను బంధాలను చాటారు. మిఠాయిలు తినిపించి దీవెనలు పొందారు. చిన్నా.. పెద్దా అని తేడా లేకుండా అంతా కలిసి సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. ప్రతి ఇంటా రాఖీ పండగ శోభ నెలకొంది. కంచరపాలెం, కప్పరాడ, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, తాటిచెట్లపాలెం, జ్ఞానాపురం బర్మాక్యాంప్ తదితర ప్రాంతాల్లోని వీధులన్నీ రక్షా బంధన్ వేడుకలతో కళకళలాడుతూ కనిపించాయి. కంచరపాలెంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు విద్యార్థినులు రాఖీలు కట్టి ఆత్మీయ ఆనందాన్ని పంచుకున్నారు.



కంచరపాలెంలో అన్నయ్యకు రాఖీ కడుతున్న చెల్లెలు



ఎమ్మెల్యే గణబాబుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



మల్కాపురంలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లి



ట్రాఫిక్ సీఐ తులసీదాస్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి సింధు

వైభవంగా మరిడిమాంబ పండగ

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, తదితరులు అమ్మవారికి విశేష పూజలు చేసి, అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పార్టీ 63వ వార్డు కన్వీనర్ పిలక రామ్మోహనరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ భోగవిల్లి నాగభూషణం, వార్డు అధ్యక్షుడు సోమాధుల సురేష్, గ్రామ ప్రెసిడెంట్ సూరాడ పెంటారావు, కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, కేబుల్ రాజు, లోకొండ అప్పారావు, ఈశ్వరరావు, అడపాక అప్పారావు పాల్గొన్నారు.



మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ఆడారి ఆనంద్‌కుమార్, బద్రీనాథ్

ఐఎన్‌ఎస్ మైసూర్ అప్‌గ్రేడేషన్‌పై సమీక్ష

సింధియా: విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డ్‌లో ఐఎన్‌ఎస్ మైసూర్ అప్‌గ్రేడేషన్ పురోగతిపై వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఏవీఎస్‌ఎం, వీఎస్‌ఎం గురువారం సమీక్షించారు. ఐఎన్‌ఎస్ మైసూర్‌లో ఆప్‌గ్రేడింగ్ ప్యాకేజీలో డ్రాస్ట్రాయర్ పోరాట సామర్థ్యాన్ని పెంచే అధునాతన ఆయుధాలు, సెన్సార్ల అమరిక ఆకట్టుకుంది. ఈ సమీక్ష సమయంలో నౌకాదళ సిబ్బంది, నేవల్ డాక్‌యార్డ్ బృందాలతో సంభాషించారు.



ఐఎన్‌ఎస్ మైసూర్ ప్రధాన అప్‌గ్రేడేషన్ పురోగతిని సమీక్షిస్తున్న వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్

సృజనాత్మకతే సంపద

ఏయూ క్యాంపస్: సృజనాత్మకతే పెద్ద సంపద అని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత తెలిపారు. ఏయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'అంకుర సంస్థల దిశగా యువత సామర్థ్యాల పెంపు' అనే అంశంపై గురువారం ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఆర్.విజయశాంతి స్మారకార్థం ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ సంక్లిష్ట విధానాల్లో ఆలోచించడం, డిజైనింగ్ చేయడం, స్టార్టప్స్‌ను స్థాపించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఏ హబ్ మేనేజర్ దివాకర్ స్టార్టప్స్ విస్తృతి, ప్రగతి, అనుకూల పరిస్థితులను వివరించారు. డాక్టర్ రవి సరిపల్లి డిజైన్ థింకింగ్ అంశంపై డాక్టర్ విజయశాంతి స్మారకోపన్యాసం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా యువత నుంచి 44 నవ్య ఆలోచనలు వచ్చాయి. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని తమ నవ్య ఆలోచనలను పంచుకున్నారు. విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, బీవోఎస్ చైర్‌పర్సన్ ఆచార్య కె.రమాసుధ, ఆర్.వి.ఎస్.మూర్తి, పి.కాంత ప్రసాద్, డాక్టర్ కె.పద్మ, పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న రెక్టార్ ఆచార్య సమత

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

సింహాచలం: విద్యార్థి మెడలో ఉన్న వెండి చైన్‌ను అపహరించిన ఘటనలో ముగ్గురిని పెందుర్తి క్రైం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పెందుర్తి ఎస్‌ఐ సల్మాన్‌బేగ్ తెలిపిన వివరాలిలా.. 94వ వార్డు కృష్ణరాయపురానికి చెందిన భార్గవ్ నరవలోని ఒక కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. గత నెల 28వ తేదీ సాయంత్రం కాలేజీ నుంచి వేపగుంట వచ్చి ఇంటికి నడిచివెళ్తున్నాడు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులు వచ్చి విద్యార్థి మెడలో ఉన్న చైన్, సెల్‌ఫోన్‌ను లాక్కుని వెళ్లిపోయారు. ఈ విషయం తల్లిదండ్రులకు భార్గవ్ చెప్పడంతో వారు పెందుర్తి క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగతనానికి పాల్పడిన ముగ్గురిని ఎస్‌ఐ సల్మాన్‌బేగ్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

గ్యాంగ్‌ల హల్‌చల్‌పై అసత్య ప్రచారాలు నమ్మవద్దు

గోపాలపట్నం: ఇటీవల కారులపై దాడి చేసే గ్యాంగ్‌లు విశాఖలో తిరుగుతున్నాయని, షీలానగర్ నుంచి ఎయిర్‌పోర్టు మధ్యలో జాతీయ రహదారిపై దాడికి పాల్పడుతున్నారని, సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాల్ని నమ్మ వద్దని నగర పోలీసులు ఒక ప్రకటనలో కోరారు. గత నెల 29న సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. 7, 8 బ్యాచ్‌లు తిరుగుతున్నాయని ప్రచారం చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టగా.. గాజువాక స్టీల్ ప్లాంట్‌లో వివాహానికి హాజరై నగరంలోకి బైక్‌పై వెళ్తున్న సమయంలో షీలానగర్ వద్ద కారు రాసుకుంటూ వెళ్లింది. అయితే ద్విచక్ర వాహనదారులు కారును ఆపాలంటూ అద్దాలను కొట్టారు. విషయం తెలియక కారులో ఉన్న వ్యక్తులు భయపడి వీడియో తీసి తమ బంధువులకు, స్నేహితులకు పంపారు. దీన్ని దుండగుల దాడిగా వీడియోతో పాటు వాయిస్ మెసేజ్‌లు వైరల్ చేశారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని పోలీసులు కోరారు. ఎటువంటి సమస్యలు తలెత్తినా 100, 112, 1090(క్రైమ్ స్టాపర్), 1091 (క్రైమ్ ఎగెనెస్ట్ ఉమెన్)వంటి టోల్ ఫ్రీనంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

5 నుంచి కృష్ణాష్టమి వేడుకలు

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు లక్ష్మీనరసింహనగర్‌లోని గోపీజన వల్లభస్వామి ఆలయంలో ఈ నెల 5, 6 తేదీల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 5న సాయంత్రం 5.30 గంటలకు శోభాయాత్ర, 6న ఉదయం 6.30 గంటలకు స్వామికి క్షీరాభిషేకం, ఉదయం 8.30 గంటల నుంచి సహస్ర నామార్చన, , మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన జరుగుతాయని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు స్వామికి 108 రకాల ప్రసాదాలతో నివేదన, సాయంత్రం 5 గంటలకు ఊంజల్ సేవ, 5.30 గంటలకు బాలకృష్ణుడి వేషధారణ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

'మరుగు'కు తప్పని అవస్థలు



మూసిఉన్న మరుగుదొడ్లు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు రైతుబజార్ ఎదురుగా ఏర్పాటు చేసిన మరుగు దొడ్లు ఎప్పుడూ తాళాలు వేసే ఉంటున్నాయి. దీంతో వీటిని వినియోగించుకునే పరిస్థితి లేదని రైతుబజార్‌కు వస్తున్న వినియోగదారులు అంటున్నారు. ఆ దారిలో ప్రయాణించే వారు కూడా వీటిని వినియోగించుకునే వీలుగా మరుగుదొడ్ల నిర్వహణపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆనంద్‌కుమార్
- 92వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బాపూజీనగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ పని చేస్తోందని ఆ పార్టీ విశాఖ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో 92వ వార్డులో రూ.33 లక్షలతో తలపెట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రాష్ట్రంలో పరుగులు తీస్తున్నాయన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా స్థానికులు తెలిపిన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఇక్కడి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఇందిరానగర్‌లో రూ. 6.57 లక్షలతో సీసీ కాలువలు, ప్యాచ్ వర్కులు, అప్పాజి టవర్స్ వద్ద రూ.6.91 లక్షలతో సీసీ కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం, బాపూజీనగర్‌లో రూ.11.50 లక్షలతో సామాజిక భవనం అదనపు అంతస్తు నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, పార్టీ వార్డు అధ్యక్షులు అప్పలస్వామినాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, జేఏసీ కన్వీనర్ గేదెల మురళీకృష్ణ, ఊటపల్లి గోవిందు, దేరెడ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

2 వేల మొక్కలు నాటిన హెచ్‌పీసీఎల్

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా అధికారులు గురువారం సుమారు 2వేల మొక్కలను నాటారు. పంచ భూతాలైన ఆకాశం, గాలి, అగ్ని, నీరు, భూమితో మనిషి పొందుతున్న ఉపయోగాలను పంచతత్వం కా మహారత్న థీమ్‌లో అధికారులు గుర్తు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెచ్‌పీసీఎల్ ఈడీ రతన్‌రాజ్ పాల్గొని ఐఎన్‌ఎస్ డేగా ప్రాంతంలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ జిల్లా అటవీ శాఖ మార్గదర్శకాలను తీసుకుని ఈ మొక్కలను నాటామని చెప్పారు. ఇక్కడ 52 ఎకరాల విశాలమైన భూమిలో సుమారు 20 వేల మొక్కలను నాటే యోచనలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వి.బి.రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఈడీ రతన్‌రాజ్

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

మల్కాపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని, అటువంటి వ్యక్తిని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని జీవీఎంసీ 40, 61, 62, 63వ వార్డుల జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం అన్నారు. 61వ వార్డు ఇండస్ట్రీయల్ కాలనీ సచివాలయాల పరిధి గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లతో గురువారం సమావేశమయ్యారు. స్థానిక సామాజిక భవనం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు, బూస అప్పలరెడ్డి, మధుబాబు, స్వప్న, రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం

ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పై కారు బోల్తా

గోపాలపట్నం: ఎన్‌ఏడీ కూడలిలోని ఫ్లైఓవర్‌పై బుధవారం అర్ధరాత్రి సమయంలో ఓ కారు రైలింగ్ ఢీకొట్టి బోల్తా పడింది. క్రైమ్ ఎస్‌ఐ కాంతారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కారులో ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో కారు నడుపుతున్న సుమిత్ పాత్రోకు ఎటువంటి గాయాలు కాలేదు. కారును ఎయిర్‌పోర్టు పోలీసులు స్టేషన్‌కు తరలించారు. సుమిత్ పాత్రో సీతమ్మధార ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదు.



ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పై బోల్తా పడిన కారు

బౌద్ధాలయంలో శ్రావణ పౌర్ణమి పూజలు

కంచరపాలెం: స్థానిక అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో గురువారం శ్రావణ మాస శుద్ధ శ్రావణ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. బుద్ధుడిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సీనియర్ ఉపాసకుడు కోన వెంకటరావు బౌద్ధుని చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, భీమారావు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్, బౌద్ధ సమాజం సభ్యులు పాల్గొన్నారు.



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బౌద్ధ సమాజం ప్రతినిధులు

ఉత్తమ ఉపాధ్యాయుడిగా సుబ్రహ్మణ్యేశ్వరరావు ఎంపిక



సుబ్రహ్మణ్యేశ్వరరావు

సింహాచలం: ఈ నెల 5న గురుపూజ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారానికి లెక్చరర్ కేడర్‌లో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకుడు కె.వి.ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు ఎంపికయ్యారు. విజయనగరం జిల్లా ఎంఆర్‌ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఆయన పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు 2020లో డిప్యుటేషన్‌పై వచ్చారు. ఇన్‌స్టిట్యూషన్ డెవలప్‌మెంట్, లేబరేటరీ డెవలప్‌మెంట్ యాక్టివిటీస్‌లో, పలు వర్క్‌షాప్‌ల నిర్వహణలో సుబ్రహ్మణేశ్వరరావు ప్రతిభ చూపారు. 2022లో జరిగిన రీజినల్ టెక్‌ఫెస్ట్ కాంపిటీషన్‌లో సుబ్రహ్మణ్యేశ్వరరావు టీచింగ్ చేసిన పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాల బ్యాచ్ విద్యార్థులు ప్రథమ బహుమతిని సాధించారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజనకు సంబంధించి కోర్సులకు కళాశాలలో ట్రైనర్‌గా కూడా పనిచేస్తున్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారిగా ఉంటూ విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ రావడంలో కృషి చేశారు. దాదాపు 90 మంది స్టూడెంట్లు పలు సంస్థల్లో ఉద్యోగాలు సాధించేందుకు దోహదపడ్డారు.